సాక్షి
నిజామాబాద్
శనివారం। 19। ఆగస్టు। 2023




పుడమికి పచ్చ రంగు

నేడు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ డే
ప్రత్యేక చిత్రాలు – 8లో

గరిష్టం/కనిష్టం
32.6 /24.9

వాతావరణం
ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తాయి. ఆకాశం మబ్బుపట్టి ఉంటుంది. సాయంత్రం మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

పిలిచి పెత్తనమిస్తే..



తెలంగాణ వర్సిటీ పాలక మండలి సభ్యులు ఏరికోరి రిజిస్ట్రార్ స్థానంలో ప్రొఫెసర్ యాదగిరిని కూర్చోబెడితే ఆయన ప్రదర్శిస్తున్న లీలలూ అంతాఇంతా లేవు. ఏకంగా ఈసీ తీర్మానాలనే మార్చినట్లు తెలుస్తోంది. ఏడుగురు ప్రోగ్రామర్లకు జీతం పెంచాలని తీర్మానిస్తే.. యాదగిరి మరో ముగ్గురిని అందులో చేర్చారు. మరొకరి విషయంలో ఇన్‌చార్జి వీసీ పరిశీలనకు రాస్తే ఏకంగా ఉద్యోగంలో నియమించే ప్రయత్నం చేశారు. యాదగిరి తీరుపై ఈసీ సభ్యులు గుర్రుగా ఉన్నారు.

- తెలంగాణ వర్సిటీలో మాయాజాలం చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి
- పాలకమండలి నిర్ణయాలను తారుమారు చేస్తున్న వైనం
- ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణను సైతం తప్పుదోవ పట్టించేలా వ్యవహారాలు
- ఈసీ సభ్యులు కన్నెర్ర చేయడంతో పలు నిర్ణయాలు వెనక్కి..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ యూనివర్సిటీలో గత వీసీ రవీందర్‌గుప్తా అక్రమాలపై అలుపెరగని పోరాటం చేసిన పాలకమండలి సభ్యులు అత్యంత నమ్మకంతో రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరిని నియమించారు. అయితే ఆ నమ్మకాన్ని యాదగిరి ఆదిలోనే వమ్ము చేసే చర్యలకు పాల్పడడంతో పాలకమండలి సభ్యులు గుర్రుగా ఉన్నారు. తాజాగా చోటుచేసుకున్న పరిణామాలతో ఈసీ సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

ఈ నెల 10న హైదరాబాద్‌లో ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆధ్వర్యంలో ఈసీ సమావేశం జరిగింది. రిజిస్ట్రార్ ప్రస్తావన నేపథ్యంలో ఈ సమావేశంలో ఏడుగురు ప్రోగ్రామర్లకు జీతం పెంచేందుకు నిర్ణయించారు. ఇతర సిబ్బందికి పెంచ వద్దని నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా 2014 బ్యాచ్‌కు సంబంధించి పదోన్నతుల విషయంలో లీగల్ ఒపీనియన్ తీసుకోవాలని ఈసీ తీర్మానం చేసింది. అయితే రిజిస్ట్రార్ చర్యలు మాత్రం ఇందు కు విరుద్ధంగా ఉండడం గమనార్హం.

■ ప్రవీణ్ అనే వ్యక్తి జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ మూడేళ్ల కిత్రం దుబాయ్ వెళ్లిపోయాడు. తిరిగి వచ్చిన ప్రవీణ్ పదిరోజుల క్రితం రిక్వెస్ట్ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణకు రిక్వెస్ట్ లెటర్ పెట్టించారు. ఆమె ఇనీషియల్ వేసి పరిశీలనకు రాశారు. ఇదే అదునుగా రిజిస్ట్రార్ యాదగిరి, ప్రవీణ్‌ను జూనియర్ అసిస్టెంట్‌గా ఐదు రోజుల క్రితం తిరిగి తీసుకున్నారు. ఈసీ సభ్యులు ఫోన్ చేసి నిలదీయడంతో కొన్ని గంటల వ్యవధిలోనే అదేరోజు ప్రవీణ్‌ను తొలగించారు.

■ ఇక 2014 బ్యాచ్ పదోన్నతులకు సంబంధించి లీగల్ ఒపీనియన్ తీసుకోవాలని ఈసీ సమావేశంలో నిర్ణయించగా, ఇందుకు విరుద్ధంగా ప్రొఫెసర్ యాదగిరి ప్రభుత్వానికి రాయాలని నిర్ణయించినట్లు ఫైల్ తయారు చేసి తప్పుదోవ పట్టించడంతో ఈసీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

■ ఈసీ సభ్యుల ఆగ్రహం నేపథ్యంలో పైన చెప్పిన వ్యవహారాలకు సంబంధించి తప్పుదోవ పట్టించేలా రాసిన ఫైల్‌ను రిజిస్ట్రార్ యాదగిరి చింపేశారు. తిరిగి పాలకమండలి నిర్ణయాల ప్రకారం కొత్త ఫైల్ తయారు చేయడం గమనార్హం.

ఈ విషయాలపై కొందరు ఈసీ సభ్యులు 'సాక్షి'తో మాట్లాడుతూ తమను తప్పుదోవ పట్టించేలా రిజిస్ట్రార్ యాదగిరి వ్యవహరించాల్సిన అవసరమేముందన్నారు. పిలిచి రిజిస్ట్రార్‌గా నియామకం చేస్తే ఇలా చేయడం క్షమించరానిదన్నారు.

తీర్మానాల మార్పు.. ఈసీ సభ్యుల ఆగ్రహం..

కేవలం ఏడుగురు ప్రోగ్రామర్లకు జీతం పెంచాలని ఈసీ తీర్మానం ఉండగా, యాదగిరి మాత్రం గుట్టుచప్పుడు కాకుండా మరో ముగ్గురిని ఇందులో చేర్చారు. ఇందులో వీసీ పీఏ, రిజిస్ట్రార్ పీఏ, తనకు సన్నిహితంగా ఉండే కామర్స్ విభాగంలో పనిచేస్తున్న రాజు అనే జూనియర్ అసిస్టెంట్‌లను చేర్చారు. ఇక్కడ మరో విచిత్రమేమిటంటే రాజును ప్రోగామర్‌గా ప్రమోట్ చేస్తున్నట్లు ఈసీ తీర్మానం చేసినట్లు తప్పుదోవ పట్టించడం విశేషం. ఇదిలా ఉండగా ఈసీ సమావేశంలో అసలు చర్చకు రాని లైబ్రేరియన్‌కు జీతం పెంచే అంశంపై తీర్మానం చేసినట్లు ఫైల్ తయారు చేశారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఈ ఫైల్‌పై ముగ్గురు ఇంటర్నల్ ఈసీ సభ్యులు, మరో ఎక్స్‌టర్నల్ ఈసీ సభ్యుడితో సంతకం సైతం పెట్టించారు. రిజిస్ట్రార్ యాదగిరి చేసిన ఈ వ్యవహారంపై మిగిలిన ఎక్స్‌టర్నల్ ఈసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి రాజకీయాలు సహించేది లేదన్నారు. కాగా జూనియర్ అసిస్టెంట్ రాజు రిజిస్ట్రార్ యాదగిరికి డ్రైవర్‌గా వ్యవహరిస్తూ, యాదగిరి వద్ద చేస్తున్న పీహెచ్‌డీ స్కాలర్లకు టైపింగ్ చేసి, డబ్బులు వసూలు చేసి అందులో కొంత మొత్తం యాదగిరికి ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆదాయం @ రూ.70.60 కోట్లు



వైన్స్‌లకు దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు

- 102 వైన్స్‌లకు 3530 దరఖాస్తులు
- మోపాల్, మాణిక్ భండార్, ఏర్గట్ల వైన్స్‌లకు పెరిగిన పోటీ
- శ్రావణ మాసం సెంటిమెంట్‌తో మహిళల ద్వారా దరఖాస్తులు
- రెండ్రోజులుగా జిల్లాలోనే రాష్ట్రజాయింట్ కమిషనర్
- రాత్రి 1 గంట వరకు సాగిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ

ఖలీల్‌వాడి : జిల్లాలోని 102 వైన్స్‌లకు దరఖాస్తులు శుక్రవారం ఆఖరు రోజు ఏకంగా 1832 వచ్చాయి. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 3530 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 16 వరకు 545 దరఖాస్తులు మాత్రమే రావడంతో రాష్ట్ర జాయింట్ కమిషనర్ యాషీన్‌ఖురేషీ జిల్లా కార్యాలయంలో ఉండి పరిశీలించారు. జిల్లాలోని ఎక్సైజ్ సీఐలు, ఎస్సైలు, సిబ్బందికి యాషీన్ ఖురేషీ సలహాలు, సూచనలు చేసినట్లు సమాచారం. దరఖాస్తు దారులకు ఇబ్బందులు కలుగకుండా రెండ్రోజుల నుంచి అదనంగా ఏడు వైన్స్‌లకు ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ సూపరిన్‌టెండెంట్ మల్లారెడ్డి చెప్పారు. జిల్లాలో అత్యధికంగా మోపాల్ వైన్స్‌కు 110, మాణిక్ భండార్ వైన్స్‌కు 109, ఏర్గట్ల వైన్స్‌కు 108 దరఖాస్తులు వచ్చాయని, అతి తక్కువగా సాటాపూర్ వైన్స్‌కు నాలుగు దరఖాస్తులు మల్లారెడ్డి తెలిపారు. ఒక్కో వైన్స్‌కు 20 దరఖాస్తులు తక్కువ కాకుండా ఉంటేనే డ్రా తీస్తారనే వచ్చే వార్తలలో నిజం లేదన్నారు. ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్నారు. 2021 నవంబర్‌లో ఏడు దరఖాస్తులు వచ్చిన వైన్స్‌లను కూడా లాటరీ ద్వారా కేటాయించామన్నారు. రాత్రి 10 గంటల వరకు దరఖాస్తులకు గడువు ముగిసినప్పటికీ క్యూలో పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారు లు ఉండటంతో రాత్రి ఒంటి గంట వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. శ్రా వణ మాసం కావడంతో మహిళలతో దరఖా స్తులు చేయించారు. కొందరికి సెంటిమెంట్ కావడంతో దరఖాస్తులు చేసినట్లు 'సాక్షి'కి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తు లు అధిక సంఖ్యలో రావడంతో ఇబ్బందులు కలుగకుండా ఎక్సైజ్ అధికారులు సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఈనెల 21న జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా వైన్స్‌లను కేటాయించనున్నారు. నవంబర్ 2021న 1762 దరఖాస్తులు రాగా జిల్లా నుంచి ఎక్సైజ్‌కు రూ.35.24 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది 3530 దరఖాస్తులకు రూ.70.60 కోట్లు ఆదాయం వచ్చింది. అర్ధరాత్రి ప్రక్రియ ముగిసే వరకు ఇంకా వంద నుంచి రెండు వందల వరకు దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు.



దరఖాస్తుదారుల సందడి

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



నిజామాబాద్‌నాగారం: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కవిత అధికారులను కోరారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితో పాటు మున్సిపల్ కమిషనర్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్లో మాట్లాడారు. ముఖ్యంగా డెంగీ నివారణకు కృషి చేయాలన్నారు. దోమల నివారణ మందులను ఎప్పటికప్పుడు పిచికారీ చేస్తూ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. డెంగీ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీజనల్ వ్యాధుల నివారణ మందులు అందుబాటులో ఉంచాలన్నారు.

నుడా చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



నిజామాబాద్‌నాగారం: నుడా చైర్మన్‌గా ఈగ సంజీవరెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రభుత్వం ఈనెల 14న నుడా చైర్మన్‌గా ఈగ సంజీవరెడ్డిని నియమించింది. శుభముహూర్తం చూసుకుని బాధ్యతలను స్వీకరించారు. నుడా సీపీవో శ్యామ్‌కుమార్, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

బాల్కొండకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు



బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం మూడు సంవత్సరాల క్రితమే స్థల పరిశీలన చేపట్టారు. జూనియర్ కళాశాల పక్కన స్థలాన్ని కేటాయించారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుతో ఉమ్మడి బాల్కొండ మండల విద్యార్థులకు మేలు కలుగనుంది. ఇప్పటి వరకు ఈ ప్రాంత విద్యార్థులు ఆర్మూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చదివే వారు. డిగ్రీ కళాశాల మంజూరుతో మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం కేసీఆర్, మంత్రివేముల ప్రశాంత్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, నాయకులు లింగాగౌడ్, దాసరి వెంకటేశ్, విద్యాసాగర్, షాహిద్, వాహబ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల ఉత్పత్తికి సెలవు

- 2.6 కోట్ల స్పాన్, కోటి వరకు చేప పిల్లల ఉత్పత్తి
- నాలుగు సార్లు ప్రయోగం విఫలం



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గల జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తిని అధికారులు నిలిపివేశారు. ప్రతి ఏడాది జూలై , ఆగష్టు మాసాల్లో చేప పిల్లల ఉత్పత్తిని చేపడుతారు. గత నెల మొదటి వారంలో చేప పిల్లల ఉత్పత్తి ప్రారంభం కాగా మూడవ వారంలోనే నిలిపివేశారు. ప్రస్తుత ఏడాది 10 కోట్ల స్పాన్‌తో 2.85 కోట్ల చేప పిల్లల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే 2.6 కోట్ల స్పాన్ మాత్రమే ఉత్పత్తి జరిగింది. అందులో నుంచి కోటి చేప పిల్లల ఉత్పత్తి జరిగింది. లక్ష్యం చేరకుండానే చేప పిల్లల ఉత్పత్తి ముగిసింది. అసలు సామర్థ్యం 16 కోట్ల స్పాన్ ఉత్పత్తి చేసి 5 కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేయాలి. అందులో లక్ష్యాన్నే సగానికి తగ్గించారు.

సామర్థ్యం ఉన్నా..

చేప పిల్లల ఉత్పత్తి ప్రయోగం నాలుగు సార్లు విఫలం చెందింది. ప్రతిసారి 60 లక్షల స్పాన్ నీటి పాలైంది. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో జార్ హెచరీ, ఎకో హెచరీ, చైనీస్ హెచరీ ఉన్నాయి. కాగా ఇందులో ఎకో హెచరీ మాత్రమే పని చేస్తుంది. జిల్లాకు సరిపడా చేప పిల్లలను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్నప్పటికీ ఉత్పత్తి సాధ్యం కావడం లేదు. అధికారులు చేప పిల్లల టెండర్లు, కమీషన్ పై ఉన్న ఆసక్తి మరమ్మతులపై ఉండి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని మత్స్యకారులు అంటున్నారు.

'సర్వాయి' పోరాట పటిమ స్ఫూర్తిదాయకం



సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న కలెక్టర్ తదితరులు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తి అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వినాయకనగర్‌లోని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల బాధ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వాయి పాపన్నగౌడ్ రాచరిక వ్యవస్థ కొనసాగుతున్న రోజుల్లో కుల వృత్తిపై పన్ను విధించడాన్ని వ్యతిరేకించారని అన్నారు. వేలాది మంది సైన్యాన్ని సమీకరించుకుని పన్నుల వ్యవస్థ లేని గొప్ప పరిపాలనను అందించారని కొనియాడారు. గోల్కొండ కోటను జయించి, జనరంజకంగా పాలించడం సర్వాయి పాపన్న ధైర్య సాహసాలను చాటుతోందన్నారు. గీత కార్మికులు సమష్టిగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బీసీ సంఘాల బాధ్యులు, గౌడ సంఘాల ప్రతినిధులు, అధిక సంఖ్యలో గీత వృత్తిదారులు పాల్గొన్నారు.

పథకాల అమలు వేగవంతం చేయాలి

- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



వీసీలో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

సుభాష్‌నగర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మంజూరులో అర్హులైన వారికి సకాలంలో లబ్ధి చేకూరేలా ప్రత్యేక చొరవ చూపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారి జాబితాలు పంపించాలన్నారు. ఆసరా పెన్షన్లు, తెలంగాణకు హరితహారం , బీసీ, మైనారిటీలకు ఆర్థిక సహాయం, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి, నివేశన స్థలాల అందజేత, కారుణ్య నియామకాలు తదితర అంశాలపై శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో సీఎస్ సమీక్షించారు. ఆసరా పెన్షన్ దరఖాస్తులను తక్షణమే పరిశీలించి అర్హుల జాబితాను ఆమోదం నిమిత్తం పంపించాలని సూచించారు. నాలుగు రోజుల్లోపు ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈవిషయమై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు స్పందిస్తూ రెండ్రోజుల్లో పరిశీలన ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే సంబంధిత క్షేత్రస్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని సీఎస్ దృష్టికి తెచ్చారు. నోటరీ భూముల కింద వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని సీఎస్ సూచించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా నియామక ఉత్తర్వులను అందించడంలో జాప్యం చేయవద్దన్నారు. 26న ఒకే రోజు కోటి మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించి, మొక్కలు, అవసరమైన ఇతర సామగ్రిని పంపించాలని, ప్రజాప్రతినిధులను సంప్రదించి అన్ని వర్గాల వారు భాగస్వాములు అయ్యేలా వ్యవహరించాలని సీఎస్ మార్గనిర్దేశం చేశారు. గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రతిరో జూ సగటున కనీసం ఇరవై బృందాలను జీవాల కొనుగోలు కోసం పంపిస్తున్నామని, నిర్ణీత గడువులోపు గొర్రెల పంపిణీ లక్ష్యం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సీఎస్‌కు తెలిపారు.

ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని సీఎస్ ఆయా జిల్లాల కలెక్టర్లకు సూచించారు. బీసీ కుల వృత్తులు, మైనారిటీ బంధు కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గృహలక్ష్మి పథకానికి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో వేగంగా పరిశీలన చేయించాలని ఆదేశించారు. పథకం అమలును నిశితంగా పరిశీలించేందుకు జిల్లాస్థాయిలో సూపర్‌వైజర్ అధికారిని నియమించాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, డీఎఫ్‌ఓ వికాస్ మీనా, డీఆర్‌డీఓ చందర్ పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో సర్పంచులు

- జీపీలకు నిధుల కొరత
- అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు, కార్మికులకు వేతనాల చెల్లింపులు
- ఎనిమిది నెలలుగా జమ కాని ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ ఫండ్!
- రూ.80 కోట్లకుపైగా రావాల్సిన నిధులు
- రూ.50 కోట్లు అంటున్న అధికారులు

■ 'గ్రామపంచాయతీలో అభివృద్ధి పనులకు రూ.9.20 లక్షలు అప్పులు తెచ్చాను. పంచాయతీ కార్మికులకు రెండు నెలల వేతనాలు రూ.1.80 లక్షలు సొంత డబ్బులు ఇచ్చాను. జనవరి నుంచి జీపీ ఖాతాల్లో ఎలాంటి నిధులు జమ కాలేదు. బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. గ్రామాల్లో పనులు చేపట్టకపోతే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు తెచ్చి పెడుతున్నాం. – మోహన్, గన్నారం సర్పంచ్, ఇందల్వాయి మండలం

■ 'గ్రామపంచాయతీలో అభివృద్ధి పనులకు రూ.18 లక్షల వరకు అప్పులు తెచ్చి చేపట్టాం. చెక్కులు చేసి ట్రెజరీకి పంపించాం. ఆరునెలలుగా ఎదురుచూస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి జీపీలకు ఒక్క రూపాయి కూడా రావడంలేదు. మరో రూ.22 లక్షల వరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాం. తరచూ అధికారులకు ఫోన్లు చేస్తే అదిగో.. ఇదిగో అంటూ దాటవేస్తున్నారు. వారిని ఇంతకంటే ఎక్కువ ఒత్తిడి చేయలేం. మూడు నెలలుగా కార్మికులకు వేతనాల్లేవు. వారు వచ్చి నన్ను అడుగుతున్నారు. – ఓ సర్పంచ్, మోపాల్ మండలం

సుభాష్‌నగర్ : గ్రామ పంచాయతీ ఖాతాలు నిండుకున్నాయి. దాదాపు ఎనిమిది నెలలుగా ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు జమ కావడం లేదని సర్పంచులు వాపోతున్నారు. మరోవైపు అధికారులు మాత్రం మార్చి నుంచే జమ కావాల్సి ఉందని పేర్కొంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.80 కోట్లకుపైగా నిధులు రావాల్సి ఉంది. మూడు, నాలుగు నెలలుగా గ్రామపంచాయ తీ మల్టీపర్పస్ కార్మికులకు వేతనాలు అందడం లేదంటే జీపీల్లో పరిస్థితికి అద్దం పడుతోంది. సర్పంచులు అప్పులు తీసుకొచ్చి సగం వరకు వేతనాలు తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లిస్తున్నారు. మరికొన్ని చోట్ల కార్మికులు సర్పంచులతో వాదనలకు దిగుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 530 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన ప్రతినెలా స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి పంచాయతీ ఖాతాలో జమ అవుతాయి. అదేవిధంగా ఆర్థిక సంఘం నిధులు కూడా సుమారు అంతే మొత్తంలో వస్తాయి. ఈ నిధులతోనే జీపీల్లో అభివృద్ధి పనులు చేపడుతూ, కార్మికుల వేతనాలు చెల్లించేవారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్లెడ మాజీ సర్పంచ్ (ఫైల్)



జనవరి 30న కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం చేసిన నందిపేట సర్పంచ్ దంపతులు (ఫైల్)

అప్పుల పాలవుతున్న సర్పంచులు..

ఒకవైపు నిధులు.. మరోవైపు బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో సర్పంచులు తీవ్ర అప్పుల పాలవుతున్నారు. ఇటీవల సస్పెండ్ అయిన కల్లెడ సర్పంచ్ లావణ్య ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం తెలిసిందే. కల్లెడ పంచాయతీకి రూ.19 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. అదేవిధంగా రూ.కోటి వరకు బిల్లులు రావాల్సి ఉందని గతంలో నందిపేట్ సర్పంచ్ సాంబారు వాణి దంపతులు కూడా కలెక్టరేట్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. జిల్లాలో చాలా మంది సర్పంచులది ఇదే పరిస్థితి. గ్రామపంచాయతీల్లో నిధుల కంటే బిల్లులే అధికంగా రావాల్సి ఉందని సర్పంచులు వాపోతున్నారు. నెలల తరబడి ట్రెజరీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. చెక్కులకు మోక్షం కలగడంలేదు. ఇప్పటికైనా త్వరగా నిధులు, బిల్లులు విడుదలయ్యేలా ప్రభుత్వాలు చొరవ చూపాలని సర్పంచులు కోరుతున్నారు.

విడుదల కాని నిధులు, బిల్లులు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు విడుదల కావాల్సిన నిధులు రూ.80 కోట్లు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నాయని సర్పంచ్‌లు చెబుతున్నారు. అదేవిధంగా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి మరో రూ.50 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉందంటున్నారు. అయి తే ఐదు నెలల నుంచే జమకావాల్సి ఉందని, ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ కలిసి సుమారు రూ.50 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

నెలరోజుల్లో క్లియర్ అవుతాయి



గ్రామపంచాయతీలకు నెలరోజుల్లో ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదల అయ్యే అవకాశముంది. మార్చి నుంచి రూ.50 కోట్ల వరకు నిధులు జమ కావాల్సి ఉంది. ఈమేరకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సర్పంచులు, గ్రామపంచాయతీ కార్మికుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నాం. – జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

పీహెచ్‌సీ పరిశీలన



బాల్కొండ : మెండోరా మండలం పోచంపాడ్‌ పీహెచ్‌సీని ఎన్‌క్యూఏఎస్‌ (నేషనల్‌ క్వాలిటీ అస్యూరెన్స్‌ స్టాండర్డ్‌ కమిటీ) సభ్యులు డాక్టర్‌ మహాలక్ష్మి, డాక్టర్‌ ఎలిజబెద్‌ వరర్గీష్‌ బృందం శుక్రవారం పరిశీలించారు. జాతీయ ప్రమాణాలను పాటిస్తూ ప్రజలకు వైద్యసేవలు అందిస్తే ఆ పీహెచ్‌సీలను ఎంపిక చేసి ప్రతి ఏడాది నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ. 3 లక్షల ప్రత్యేక నిధులు అందిస్తారు. శనివారం రెండోరోజు కూడా పరిశీలన ఉంటుందన్నారు. డీఎంహెచ్‌వో సుదర్శనం, వైద్యులు రాకేశ్‌, సతీష్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థులు



మాక్లూర్‌ : జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ నిజామాబాద్‌ లాంగ్‌ అండ్‌ మిడిల్‌ డిస్టెన్స్‌ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని నాగారం స్టేడియంలో జరిగిన పరుగు పందెం పోటీల్లో మాక్లూర్‌ కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపికయ్యారు. నిఖిత 2000 మీ రన్నింగ్‌లో ఫస్ట్‌ప్లేస్‌, అనూష 800 మీ రన్నింగ్‌లో సెకండ్‌ప్లేస్‌, శ్రావ్య థర్డ్‌ ప్లేస్‌లో నిలిచారు. మాక్లూర్‌ కేజీబీవీ పీఈటీ సంధ్య, ఉపాధ్యాయులు సవిత విద్యార్థులను అభినందించారు.

నాణ్యమైన విద్యను బోధించాలి

బాల్కొండ : నాణ్యమైన విద్యను బోధించాలని జిల్లా ఇంటర్‌ అధికారి రఘురాజు అన్నారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. నాణ్యత ప్రమాణాలు మెరుగుపర్చాలని అధ్యాపకులకు సూచించారు. ప్రిన్సిపాల్‌ చిన్నయ్య, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

బట్వాడా చేయకుండా ఇంట్లో పడేసి..

కామారెడ్డి హెడ్‌ పోస్టాఫీసులో పోస్ట్‌మన్‌ నిర్వాకం!!

కామారెడ్డి అర్బన్‌: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా బస్తాల కొద్ది పోస్టుకార్డులు, బ్యాంకు ఏటీఎం, ఆధార్‌ కార్డులు, ఎల్‌ఐసీ పాలసీ బాండ్లు, పాస్‌పోర్టులు, సాధారణ ఉత్తరాలు బట్వాడా చేయకుండానే చేసినట్టు రాసుకొని ఇంట్లో నిల్వ చేసిన పోస్టుమన్‌ ఉదంతం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి హెడ్‌పోస్టాఫీసుకు చెందిన పోస్టుమెన్‌ సీతారాం గత కొన్ని నెలలుగా పట్టణంలో బట్వాడా చేయకుండానే చేసినట్టు రాసుకుంటున్నట్టు తేలింది. ఈ విషయమై పలువురు బాధితులు పోస్టుమాస్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సీతారాం గతంలోనూ ఒక్కో రిజిస్టర్‌ లెటర్‌ బట్వాడాకు రూ. వంద తీసుకోవడంతో అతన్ని ఇతర విధుల్లోకి బదిలీ చేశారని అంటున్నారు. గతేడాది కొత్త పోస్టుమాస్టర్‌ రావడంతో సీతారాం మళ్లీ విధుల్లోకి చేరి ఇతరులతో ఉత్తరాలు బట్వాడా చేయిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. సీతారాంపై పోలీసు కేసులు నమోదు చేసి విచారణ చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు రిపోర్టు చేశాను

పోస్టుమెన్‌ సీతారాం ఉత్తరాలు బట్వాడా చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం ఉన్నతాధికారులకు రిపోర్టు చేశాను. గతంలోనూ నిర్లక్ష్యం చేయగా శాఖాపరంగా చర్యలు తీసుకున్నారు. తిరిగి మళ్లీ అదే అక్రమాలకు పాల్పడుతున్నారు.

– ఆర్‌ రాజు, ఇన్‌చార్జి పోస్టుమాస్టర్‌

చిత్రం.. చెదరని జ్ఞాపకం



నద్మూడ వద్ద శ్రీరాంసాగర్‌ బ్యాక్‌ వాటర్‌లో విదేశీ పక్షుల సందడి



పురివిప్పిన నెమలి నాట్యం

వెయ్యి మాటలు చెప్పలేని భావాన్ని ఒక్క ఫొటో చెబుతుంది. వర్తమాన అంశాలను భవిష్యత్‌ తరాలకు అందిస్తుంది. మధుర జ్ఞాపకాలని తరతరాల కోసం భద్రపరుస్తుంది. పండుగలు, పబ్బాలు, వివాహాలు, వేడుకలు, విహారాలు, విషాదాలు ఇలా అన్నింటికీ ఫొటో సాక్ష్యంగా నిలుస్తుంది. అలనాటి జ్ఞాపకాల్ని మళ్లీ మళ్లీ తనివి తీరా వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చే తీపి గురుతులు ఫొటోలు మాత్రమే. నేడు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక చిత్రాలు.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌



చేపల కోసం వల విసురుతున్న మత్స్యకారుడు



గోదావరి బ్యాక్‌వాటర్‌ వద్ద ఉదయిస్తున్న సూర్యుడు



అద్దంలో చూసుకుంటూ మురిసిపోతున్న పిచ్చుక

తల్లిపాలు అమృతంతో సమానం



రుద్రూర్‌ : తల్లి పాలు అమృతంతో సమానమని, బిడ్డ పుట్టగానే ముర్రుపాలు తాగించాలని స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన పోషణ్‌ అభియాన్‌ సదస్సుకు స్పీకర్‌ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తల్లి పాల విశిష్టత గూర్చి వివరించారు. గర్భిణిగా ఉన్నప్పుడు పౌష్టికాహారం తీసుకుంటే జన్మించే బిడ్డఆరోగ్యం ఉంటుందన్నారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం మాతా శిశు సంరక్షణకు పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. పేద మహిళలు గర్భిణిగా ఉన్నప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. గర్భిణి పౌష్టికాహారం తీసుకోవడానికి బిడ్డ జన్మించే వరకు విడతల వారీగా రూ. 12 వేలు నగదు, కేసీఆర్‌ కిట్‌ ప్రభుత్వం అందచేస్తోందన్నారు. బాన్సువాడ పట్టణంలో అన్ని సౌకర్యాలతో రూ. 20 కోట్లతో వంద పడకల మాత శిశు ఆస్పత్రి నిర్మించడంతో మహిళలకు అవసరమయ్యే వైద్య సేవలందుతున్నాయన్నారు. కార్యక్రమంలో స్టేట్‌ ఉమెన్‌ కమిషన్‌ మెంబర్‌ సుధాం లక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి రసూల్‌ బీ, బోధన్‌ ఆర్డీవో రాజాగౌడ్‌, బోధన్‌ సీడీపీవో జానకి, అయేషా ఫౌండేషన్‌ చైర్మన్‌ అయేషా ఫాతిమా, ఏఆర్‌ ఎడ్యుకేషన్‌ సొసైటీ చైర్మన్‌ సునీత, ఐసీడీఎస్‌ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బస్సు కోసం విద్యార్థుల రాస్తారోకో



బోధన్‌ : ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని డిమాండ్‌ చేస్తూ శుక్రవారం సాలూర మండల కేంద్రంలో అంతరాష్ట్ర రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. పట్టణ కేంద్రంలోని పాఠశాలలు, కళాశాలలకు చదువుకోసం వెళ్లేందుకు బస్సు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పోలీసుల జోక్యంతో విద్యార్థులు ఆందోళన విరమించి డిపో డీఎం శ్రీనివాస్‌ను కలిసి తమ ఇబ్బందులను వివరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఎం వారికి హామీ ఇచ్చారు. రాస్తారోకో రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి.

కాళేశ్వరం నీళ్లిచ్చినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం

- బాజిరెడ్డికి మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి సవాల్‌
- నియోజకవర్గంలో 3 వేల 'డబుల్‌' ఇళ్లకు జాడలేదు
- అబద్ధాలు మానుకోవాలని హితవు



'సాక్షి'లో వచ్చిన కథనాన్ని చూపుతున్న భూపతిరెడ్డి

ఖలీల్‌వాడి : కాళేశ్వరంతో రూరల్‌లో ఒక్క ఎకరానికి సాగునీరిచ్చినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్‌ నిజామాబాద్‌ రూరల్‌ ఇన్‌చార్జి డాక్టర్‌ భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ హయాంలోనే ప్రాణహిత చెవేళ్ల ప్రాజెక్ట్‌ పనులు చివరి దశకు వచ్చాయని.. సీఎం కేసీఆర్‌ ప్రభుత్వం వచ్చిన తర్వాత రీడిజైన్‌ పేరుతో రూ. కోట్లు నొక్కేసినట్లు ఆ యన ఆరోపించారు. మంచిప్ప రిజర్వాయర్‌ ఎత్తు పెంచడంతో రెండు గ్రామాలు, 8 తండాలు నీట మునుగుతాయని రైతులు ఆందోళన చేస్తే కేసులు నమోదు చేయించటం ఏమిటన్నారు. దళితబంధు ఇచ్చిన వారి జాబితాను విడుదల చేయాలన్నారు. రూరల్‌లో గృహలక్ష్మి పథకంకు 2వేల అప్లికేషన్లు వ చ్చాయని పేర్కొనడం కరెక్ట్‌ కాదని, 3 వేల డబుల్‌ ఇళ్లు ఎక్కడ ఇచ్చారో చూపించాలని బాజిరెడ్డిని డి మాండ్‌ చేశారు. 2014లో బాజిరెడ్డి ఆస్తులు, ప్రస్తు తం ఉన్న ఆస్తుల లెక్క చెప్పాలన్నారు. మూణ్నెళ్లలో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక అవినీతి చిట్టా విప్పుతామన్నారు. బాజిరెడ్డి సొంత గ్రామమైన చీ మన్‌పల్లి రోడ్డు ఎలా ఉందో చెప్పాలన్నారు. సారంగపూర్‌ ఫ్యాక్టరీ తెరిపించలేకపోయారని, ఆర్టీసీ చైర్మన్‌గా ఉండి నియోజకవర్గాల్లోని బస్టాండ్లలో ఒక్క బాత్‌రూం కూడా కట్టించలేదన్నారు. డిచ్‌పల్లిని ఎడ్యుకేషన్‌ హబ్‌గా ఎలా చేస్తారని, వచ్చిన డిగ్రీ కళాశాలకు సొంత భవనం, లెక్చరర్లను నియమించాలన్నారు. వర్సిటీలో అవకతవకలను పట్టించుకోలేద న్నారు. కాంగ్రెస్‌పార్టీలోకి పలువురిని ఆహ్వానించారు. కిసాన్‌ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, పీసీసీ డిలిగేట్‌ బాడ్సి శేఖర్‌ గౌడ్‌, కాంగ్రెస్‌ అధ్యక్షులు అమృతాపూర్‌ గంగాధర్‌ పాల్గొన్నారు.

అర్హులకే 'డబుల్‌' ఇళ్లు కేటాయించాం



డబుల్‌ ఇళ్లను ప్రారంభిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్‌ : డబుల్‌ బెడ్‌రూం ఇండ్లను పూర్తిగా అర్హులైన వారికే కేటాయించామని మంత్రి ప్రశాంత్‌ రెడ్డి వెల్లడించారు. ఎలాంటి రాజకీయ జోక్యానికి అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్లను కేటాయించి లబ్ధిదారులకు అందించామన్నారు. శుక్రవారం మోర్తాడ్‌లో నిర్మించిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్లలో లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయించారు. అనంతరం మాట్లాడుతూ 244 ఇండ్లు నిర్మించగా వాటిలో 155 మంది లబ్ధిదారులకు కేటాయించామని తెలిపారు. 69 ఇండ్లను రెండో విడతలో పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీటి కోసం రూ.15 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సొంతంగా జాగా ఉన్నవారికి 120 మందికి గృహలక్ష్మి పథకం కింద ఇళ్ల నిర్మాణంకు సాయం మంజూరు చేయిస్తామన్నారు. ఇళ్లు రాని వారు అసంతృప్తి చెందవద్దని, మరన్ని పథకాలున్నాయన్నారు. డబుల్‌ బెడ్‌రూం ఇళ్లను ఎవరు అమ్ముకోవద్దన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ రమేశ్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్‌, జెడ్పీటీసీ సభ్యుడు బద్దం రవి, సర్పంచ్‌ భోగ ధరణి, వైస్‌ ఎంపీపీ తొగటి శ్రీనివాస్‌, ఎంపీటీసీ సభ్యులు రాజ్‌పాల్‌, లావణ్య, ఆర్‌డీవో వినోద్‌ కుమార్‌, డీఎల్‌పీవో శ్రీనివాస్‌, ఎంపీడీవో శ్రీనివాస్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్‌ చేసుకోవాలి

నిజామాబాద్‌ అర్బన్‌ : ఈనెల 27న నిర్వహించే టెక్నికల్‌ టీచర్స్‌ సర్టిఫికెట్‌ (టీఆర్‌ఏ) పరీక్షలకు సంబంధించి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్‌ చేసుకోవాలని జిల్లా డీఈవో దుర్గాప్రసాద్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్‌లు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

జెడ్పీలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌

నిజామాబాద్‌నాగారం : జిల్లా పరిషత్‌ పరిధిలో కారుణ్య నియామకాలకు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ సీఈవో గోవింద్‌నాయక్‌ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. సుమారు 202 పోస్టులకు గా ను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ జరిగింది.

క్రైం కార్నర్‌

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి



కప్పల సాయిలు(ఫైల్‌)

రాజంపేట : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజంపేట మండల ఎల్లారెడ్డి పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కప్పల సాయిలు(45) ట్రాక్టర్‌ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత ఏడాది క్రితం ఆటో, ట్రాక్టర్‌ డోజర్‌ కొనుగోలు చేశాడు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. దీంతో నిత్యం మనస్థాపానికి గురయ్యేవాడు. బుధవారం సాయంత్రం బయటకు వెళ్లిన సాయిలు తిరిగి రాలేదు. బామ్మర్ది చిన్న పోచయ్య ఫోన్‌ చేస్తే స్థానిక పోలేరమ్మ ఆలయం వద్ద ఉన్నానని తెలిపారు. అక్కడికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి చూడగా గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడిపోయినట్లు వారు గుర్తించారు. వెంటనే కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించా రు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పెద్దనాన్న రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై గంగారె డ్డి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

గాంధారి(ఎల్లారెడ్డి) : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మండలకేంద్రానికి చెందిన రాజశేఖర్‌ (29) అనే యువకుడు శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాజశేఖర్‌ స్థానికంగా ఓ రసాయన ఎరువుల దుకాణంలో గుమాస్తాగా పనిచేసేవాడు. ఈనెల 15న ప్రమాదవశాత్తు ఎరువుల బస్తాలు జారిపడడంతో తీవ్రగాయాలు కాగా చికిత్స నిమి త్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య సంజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పండ్ల మార్కెట్‌ వద్ద బైక్‌ అదుపుతప్పి..

ఖలీల్‌వాడి : నగరంలోని 1వ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఫ్రూట్‌ మార్కెట్‌ వద్ద బైక్‌ స్కిడ్‌ అయి పడిపోవడంతో షేక్‌ ఆలమ్స్‌ అలియాస్‌ షేక్‌ సమీర్‌(17) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఈనెల 13న అర్సపల్లి నుంచి నిజామాబాద్‌ వైపు వస్తుండగా ఫ్రూట్‌ మార్కెట్‌ దగ్గరలోని హోటల్‌ వద్ద బైక్‌ స్కిడ్‌ కావడంతో తలకు తీవ్రగాయాలు కాగా జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందడంతో స్నేహితుడు షేక్‌ జాఫర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతుడు నిర్మల్‌ జిల్లా బాసరలోని శారదానగర్‌కు చెందినవాడని నాలుగేళ్లుగా నిజామాబాద్‌లో లేబర్‌ పని చేస్తున్నట్లు చెప్పారు.

బైక్‌ చోరీ నిందితుడి అరెస్ట్‌



గాంధారి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో బైక్‌ను దొంగిలించిన నిందితున్ని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పనుకంటి సురేష్‌ ఈ నెల 16న రాత్రి తన బైక్‌ ఇంటి ముందు పార్కింగ్‌ చేసి నిద్ర పోయాడు. తెల్లారి ఇంటిముందు బైక్‌ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేసి మెదక్‌ జిల్లా నర్సాపూర్‌కు చెందిన సింగజోగి మోహన్‌ బైక్‌ను చోరీ చేసినట్లు గుర్తించి అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం

రెంజల్‌(బోధన్‌) : మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన వివాహిత తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైనట్లు ఎస్సై ఉదయ్‌కుమార్‌ శుక్రవారం తెలిపారు. ఈ నెల 16వ తేదీన ఇంట్లో నుంచి చిన్న కుమారుడిని తీసుకెళ్లినట్లు అత్త బేగరి మైసమ్మ ఫిర్యాదు అందించారన్నారు. నవీపేట్‌లోని ప్రైవేట్‌ పాఠశాలలో చదువుతున్న పెద్ద కుతురిని కూడా వెంట తీసుకెళ్లిందన్నారు. తన కుమారుడు రవికి బోధన్‌ మండలం సంగెం గ్రామానికి చెందిన సువర్ణతో పదేళ్ల కిందట వివాహమైందన్నారు. వారికి ముగ్గురు సంతానం ఉన్నారన్నారు.

విద్యార్థినితో అనుచిత ప్రవర్తన

- ఫీజులు చెల్లించలేదని విద్యార్థినిని బయటకు తీసుకెళ్లిన పాఠశాల చైర్మన్‌
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాలిక తల్లిదండ్రులు
- విచారణకు ఆదేశించిన డీఈవో



నగరంలో బీబీసీ పాఠశాల

నిజామాబాద్‌ అర్బన్‌ : నగరంలోని ఓ పాఠశాలలో విద్యార్థినిని ఫీజు కట్టలేదని కారణం చూపుతూ ఆ విద్యార్థినిని తన బైక్‌పై బయటకు తీసుకెళ్లిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని సాయినగర్‌లో బీబీసీ పాఠశాల ఉంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు కొనసాగుతున్న ఈ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని కొన్ని నెలలుగా పాఠశాలలో ఫీజు చెల్లించలేదు. దీంతో పాఠశాల చైర్మన్‌ ప్రవీణ్‌ గత గురువారం ఈ విద్యార్థినిని బయట ఎండలో నిల్చోబెట్టారు. అనంతరం ఆ విద్యార్థినిని తీసుకుని ఎంఈవో కార్యాలయానికి, ఇతర ప్రాంతాలకు తిప్పినట్లు విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆమె తల్లిదండ్రులు 5వ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థినిని పాఠశాల చైర్మన్‌ బైక్‌పై బయటకి తీసుకొనిపోవడంపై ఆమె తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో డీఈవో దుర్గాప్రసాద్‌ నగరంలోని దారుగల్లీ స్కూల్‌ హెచ్‌ఎం శంకర్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన నేడు విచారించనున్నారు.

వివరాలివ్వని పోలీసులు..

బీబీసీ స్కూల్‌ చైర్మన్‌ ప్రవీణ్‌పై విద్యార్థిని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయలేదు.ముగ్గురు మధ్యవర్తులు, ఓ ప్రజాప్రతినిధి కలగజేసుకుని తల్లిదండ్రులు కేసు పెట్టకుండా ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం విచారణ అధికారిగా ఉన్న దారుగల్లీ హెచ్‌ఎం శంకర్‌ శుక్రవారం కేసు వివరాల కోసం 5వ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ఎస్సై అందుబాటులో లేరు.. తర్వాత వివరాలిస్తామంటూ వెనక్కు పంపారు. దీంతో కేసు నమోదులో తాత్సారం జరుగుతోంది.

విచారణ చేపడుతున్నాం

బీబీసీ పాఠశాలపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపడుతున్నాం. దారుగల్లీ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శంకర్‌ను విచారణ అధికారిగా నియమించడం జరిగింది. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటాం.

– దుర్గాప్రసాద్‌, డీఈవో

మాట్లాడుకుంటాం అన్నారు

బీబీసీ పాఠశాల చైర్మన్‌ ప్రవీణ్‌పై ఫిర్యాదు అందింది. కాని వారు మాట్లాడుకుంటాం అన్నారు. అందుకే కేసు నమోదులో ఆలస్యమైంది. బాధితులు స్టేషన్‌ కు వస్తే మాట్లాడి కేసు నమోదు చేస్తాం.

– అప్పారావ్‌, ఎస్సై, 5వ టౌన్‌

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి

నిజాంసాగర్‌(జుక్కల్‌) : మండలంలోని సింగితం గ్రామానికి చెందిన గండివేట్‌ రాంబోయి(55) అనే జాలరి గురువారం సింగితం వాగులో గల్లంతై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రాంబోయి వాగులో చేపల వేట చేస్తుండగా వరద నీరు ఒక్కసారి ఉధృతంగా రావడంతో తెప్పమీద నుంచి పట్టుతప్పి వరద నీటిలోకి కొట్టుకుపోయాడన్నారు. శుక్రవారం మధ్యాహ్నం వెంగళంపల్లి శివారులోని సింగితం వాగులో మృతదేహం లభ్యం కావడంతో బాన్సువాడ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు..

మద్నూర్‌(జుక్కల్‌) : మండలంలోని లచ్చన్‌కు చెందిన మట్టంవార్‌ పెంటయ్య(65) గ్రామ శివారులోని లోటెన్‌ చెరువులో పడి మృతి చెందినట్లు శుక్రవారం ఎస్సై క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెంటయ్య కొంతకాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని ఆర్నెళ్ల క్రితం ఆపరేషన్‌ జరిగిందన్నారు. అప్పటి నుంచి తీవ్రనొప్పితో పెంటయ్య అవస్థలు పడ్డాడన్నారు. కొన్ని రోజుల క్రితం జుక్కల్‌ మండలంలోని నాగల్‌గావ్‌లో తన కూతురి ఇంటి వద్ద ఉంటూ వారి గొర్రెలకు కాపలాగా పనిచేసేవాడన్నారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన పెంటయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు గాలించగా పెద్ద ఎక్లార శివారులోని చెరువులో పెంటయ్య మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారన్నారు. అనారోగ్య కారణాలతోనే పెంటయ్య చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని వారి కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వన సేవకుడు..



కాసర్ల గంగాధర్‌ మృతదేహం

నందిపేట్‌(ఆర్మూర్‌): నందిపేట్‌ మండలం చౌడమ్మ కొండూరు గ్రామ పల్లె ప్రకృతి వన సేవకుడు కాసర్ల నడిపి గంగాధర్‌ (50) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పల్లెప్రకృతి వనం మినీ బృహత్‌ పార్క్‌లో కరెంటు వైర్‌ కిందికి వేలాడుతున్నదని తీయబోతుండగా గంగాధర్‌ కరెంటు షాక్‌కు గురయ్యాడు. గొర్ల కాపర్లు ట్రాన్స్‌ఫార్మర్‌ ఆఫ్‌ చేయడంతో గంగాధర్‌ కరెంట్‌ వైర్‌ నుంచి విడిపోయాడు. ఫీల్డ్‌ అసిస్టెంట్‌ సంతోష్‌గౌడ్‌ మరో వ్యక్తితో కలిసి గంగాధర్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కాని మార్గమధ్యంలోనే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. గంగాధర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కారు బోల్తా: ఆరుగురికి గాయాలు

మాచారెడ్డి : పాల్వంచ మండలం మంతన్‌ దేవునిపల్లి స్టేజీ వద్ద కామారెడ్డి–సిరిసిల్ల రహదారిపై శుక్రవారం ఓ కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి గాయాలయ్యాయి. వేములవాడకు చెందిన నిర్మల, శాన్వి, అక్షయ, రాజు, లత, దేవరాజు కామారెడ్డి మండలం బ్రాహ్మణపల్లికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. పాల్వంచ వాగు సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్‌ గౌడ్‌ తెలిపారు.

జీవితంపై విరక్తితో వివాహిత ఆత్మహత్య

ఇందల్వాయి : ఇందల్వాయి మండలం గన్నారం గ్రామానికి చెందిన కాసుల సవిత (32) అనే వివాహిత జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరు లేని సమయంలో శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. తొర్లికొండకు చెందిన సవితకు గన్నారం గ్రామానికి చెందిన కాసుల నగేష్‌తో 2008లో వివాహం జరిగింది. వీరికి లక్కీ, కావ్య, శ్రావ్య అనే ముగ్గురు ఆడపిల్లలున్నారు. ఉపాధి నిమిత్తం నగేశ్‌ గల్ఫ్‌లో ఉంటున్నాడు. అందరితో కలివిడిగా ఉండే సవిత ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు



మాట్లాడుతున్న బోధన్‌ ఏసీపీ కిరణ్‌కుమార్‌

బోధన్‌టౌన్‌(బోధన్‌) : ఈనెల 13వ తేదీన రుద్రూర్‌ మండల కేంద్రంలో జరిగిన చోరీ కేసును ఛేదించి 7.80 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకొని, చోరీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు బోధన్‌ ఏసీపీ కిరణ్‌ కుమార్‌ పేర్కొన్నారు. బోధన్‌ పట్టణంలోని ఏసీపీ ఆఫీస్‌లో శుక్రవారం మాట్లాడారు. రైస్‌మిల్‌ వ్యాపారి నారాయణ, అతడి భార్య నాగమణి రుద్రూర్‌ మండల కేంద్రంలో నివాసముంటున్నారని, నారాయణ లేని సమయంలో వారి ఇంట్లోకి చొరబడ్డ గుర్తుతెలియని వ్యక్తి ఆమెపై ఉన్న బంగారు నగలు, చెవికమ్మలు మొత్తంగా 7.80 గ్రాముల బంగారం దోచుకెళ్లాడన్నారు. రుద్రూర్‌ పీఎస్‌లో భార్యభర్తలు ఫిర్యాదు చేయగా సీఐ జయేష్‌రెడ్డి, వర్ని ఎస్సై కృష్ణకుమార్‌తో బృందాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఘటనాస్థలంలో క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు తీసుకుని విచారించగా వేలిముద్రలు నస్రుల్లాబాద్‌కు చెందిన దుర్గాప్రసాద్‌తో సరిపోయాయన్నారు. దీంతో నిందితుడిని రెండు రోజుల క్రితం వర్ని బస్టాండ్‌ వద్ద పట్టుకుని విచారించగా చోరీ తానే చేశానని, నగలను బొప్పాస్‌పల్లికి చెందిన వినోద్‌నాయక్‌కు రూ. 60 వేలకు ఇచ్చేశానన్నాడు. వినోద్‌నాయక్‌ను పట్టుకుని నగలను, అతడి బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ పేర్కొన్నారు. సీఐ బృందంతో పాటు, రుద్రూర్‌ ఎస్సై సీరేష్‌, వర్ని ఎస్సైని ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్‌ అభినందించారని, రివార్డు కోసం రిఫర్‌ చేశామని ఏసీపీ పేర్కొన్నారు.